క్లుప్తంగా

న్యాయవాదుల సభ్యత్వ నమోదు ప్రారంభం

ఖమ్మం లీగల్: బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 2023–2024 ఏడాదికి సంబంధించి సభ్యత్వ నమోదును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని కొదుమూరి బాబా ప్రసాద్ తీసుకున్నారు. ఈ నెల 31 వరకు చివరి గడువుగా కార్యవర్గం నిర్ణయించిందన్నారు. న్యాయవాదులందరూ తమ సభ్యత్వాన్ని వ్యక్తిగతంగా వచ్చి సీఓపీ, ఏఐబీ సర్టిఫికెట్లు అందజేసి సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని అధ్యక్షుడు గొల్లపూడి రామారావు, తాళ్ల వెంకట నారాయణ తెలిపారు.

రగ్గుల పంపిణీ

కూసుమంచి: మండలంలోని దివ్యాంగ, ప్రత్యేక అవసరాలు ఉన్న బాల, బాలికలకు సోమవారం రగ్గులను ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఏపీలోని కడప జిల్లా, రాయదుర్గంకు చెందిన శ్రీధర్ శాస్త్రి వీటిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఎంపీడీఓలు జయరాం, జమలారెడ్డి, ఎంఈఓ బీవీ రామాచారి, ఎంపీఓలు రాంచందర్, రాజకుమారి, ఐఈఆర్పీలు సుగుణ, అజీజ్, కృష్ణారావు, ఫిజియోథెరపిస్ట్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ ట్యాంక్ ప్రారంభం



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్, దాత తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కూరపాటి పద్మ మామ రచ్చా బుచ్చయ్య జ్ఞాపకార్థం వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈ ట్యాంక్‌ను సోమవారం కార్పొరేటర్ కూరాకుల వలరాజులు ప్రారంభించగా, దాత మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడాలనే భావనతో ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నికను సోమవారం మండలంలోని శివాయిగూడెంలో పాస్టర్ శ్యాంసన్ ఆధ్వర్యంలో చర్చిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ఎ.జగన్, జనరల్ సెక్రెటరీగా ప్రభుదాస్, ట్రెజరర్‌గా ఆనంద్ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్పు రెడ్డి, జాయింట్ సెక్రటరీగా యాకోబు, జాయింట్ ట్రెజరర్‌గా నరేష్ పాల్, గౌరవ సలహాదారుడిగా రమేష్ పాల్, ముఖ్య సలహాదారుడిగా శ్యాంసన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఎలీషా, ప్రభాకర్, హనోకు, తిమోతి గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కూసుమంచి: కూసుమంచి మండల పాస్టర్స్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక జీపీ చర్చిలో రెవ.సైమన్ కుప్పుస్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కె.సామ్యేల్ ఫిన్నీ, కార్యదర్శిగా కె.కరుణకుమార్, సహాయ కార్యదర్శిగా లూకరాజు, కోశాధికారిగా జాన్సన్, ప్రచార కార్యదర్శిగా సాల్మన్‌రాజు తో పాటు కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం గ్రామానికి లారీ డ్రైవర్ గంగాధర్ కృష్ణ, క్లీనర్ ప్రవీణ్‌లు తమ లారీతో కోదాడ వెళ్తుండగా, గువ్వలగూడెం సమీపంలో లారీ టైర్ పగలటంతో పక్కన నిలిపి టైరు మారుస్తున్నారు. ఈ క్రమంలో కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ఇద్దరిని బలంగా ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలైయ్యాయి. వీరిని స్థానికులు 108 ద్వారా ఖమ్మం తరలించారు. క్షతగాత్రుడు డ్రైవర్ భార్య రమణ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఒక్కడు
వినోద	అల వైకుంఠపురంలో..
సాయిరాం	కింగ్‌డమ్ ఆఫ్‌ద డయోనోసార్స్, అవతార్–2
ఆదిత్య	18 పేజెస్
శ్రీనివాస	ధమాకా
సుందర్	ఎస్ 5 నో ఎగ్జిట్

– ఖమ్మం గాంధీచౌక్

పార్కింగ్ ప్రాబ్లమ్..!

వ్యవసాయ మార్కెట్‌లో ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత

- నిర్దేశిత స్థలాలు లేక అవస్థలు
- సరుకుల రవాణాకు ఆటంకంగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



అపరాల యార్డులో నిలిపిన వాహనాలు



పంట ఉత్పత్తులు దింపేందుకు ఆటంకంగా ఉన్న ద్విచక్ర వాహనాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వాహనాల పార్కింగ్ సమస్యగా నానాటికి ఎక్కువ అవుతోంది. మార్కెట్ యార్డుల్లో పార్కింగ్‌కు నిర్దిష్ట స్థలాలను కేటాయించకపోవటంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతున్నారు. మార్కెట్‌లో ఉన్న మిర్చి, పత్తి, ప్రధాన యార్డుల్లో రైతులు పంట ఉత్పత్తులను ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకొస్తారు. పంట ఉత్పత్తులను తీసుకొచ్చిన వాహనాలను అన్‌లోడ్ చేసి వెంటనే వెళ్లిపోతాయి. కానీ రైతులు, కార్మికులు, వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై వచ్చి మార్కెట్‌లో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. పంట కొనుగోళ్ల తర్వాత ట్రాలీల్లో తరలించే క్రమంలో ద్విచక్రవాహనాల అడ్డుగా ఉండడంతో ఆటంకం ఏర్పడుతోంది.

సిబ్బంది కొరత..

వాహనాలను పంటను దింపే ప్రాంతాల్లో పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవడానికి మార్కెట్‌లో సరిపడా సిబ్బంది లేరు. పంట ఉత్పత్తుల విక్రయాల సీజన్‌లో మార్కెట్ యార్డుల్లో అవసరమైన మేరకు సెక్యూరిటీ వ్యవస్థ లేకుండా పోయింది. పంటల సీజన్‌లో యార్డుల్లో సరిపడా సెక్యూరిటీ గార్డులను నియమిస్తే ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయకుండా కట్టడి చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ గార్డులు పంట ఉత్పత్తుల రక్షణ, గేట్ల వద్ద, కార్యాలయాల వద్ద పరిమితమయ్యారు.

చేపట్టాల్సిన చర్యలు..

యార్డుల్లో పార్కింగ్ స్థానాలకు అవకాశం ఉంది. మిర్చి యార్డు, పత్తి యార్డుల్లో వివిధ గేట్ల వెంట ప్రహరీల వెంట పార్కింగ్‌కు సౌకర్యాలను కల్పించే అవకాశం ఉంది. ద్విచక్రవాహనాలను నిలిపే విధంగా పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆయా ప్రాంతాల్లోనే వాహనాలను నిలుపుకునే విధంగా మైకుల్లో ప్రకటించటం, పంట సీజన్‌లలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థానాల్లో వాహనాలను నిలిపే విధంగా సెక్యూరిటీ వ్యవస్థను నియమించటం వంటి చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కరించబడుతుంది. పంట ఉత్పత్తుల రవాణాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోతాయి.

ఆటంకం కలగొద్దు



వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ద్విచక్రవాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. దీంతో పంట ఉత్పత్తులను తీసుకొచ్చే భారీ వాహనాలకు ఇబ్బంది కలుగుతుంది. పంట దింపే షెడ్లలో కూడా వాహనాలను నిలుపుతున్నారు. పార్కింగ్‌కు తగిన చర్యలు తీసుకొని ఆటంకంగా లేకుండా చూడాలి.

– గుగులోత్ శంకర్, రైతు, విక్రమ్‌నగర్, కొణిజర్ల

స్థలాలు ఏర్పాటు చేయాలి



పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాల యార్డుల్లో ప్రధానంగా ద్వి చక్ర వాహనాలను నిలిపే స్థలాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. పంటల సీజన్‌లో సెక్యూరిటీని పెంచి ప్రత్యేకంగా వాహన పార్కింగ్ స్థానాల్లో నియమించాలి. దీంతో సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– సోమారపు సుధీర్‌కుమార్, కమీషన్ వ్యాపారి

చర్యలు తీసుకుంటాం



పంట ఉత్పత్తుల సీజన్‌లో యార్డుల్లో సెక్యూరిటీని పెంచి పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. రవాణాకు ఆటంకం కలగకుండా ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ ప్రయత్నిస్తోంది. పంట ఉత్పత్తులు దింపే షెడ్లలో వాహనాలను నిలపకుండా చూస్తాం.

– రుద్రాక్షల మల్లేషం, ఉన్నత శ్రేణి కార్యదర్శి

రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట..



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో బీసీ సామాజిక వర్గాన్ని గుర్తించి, బీసీలకు పదవులు కట్టబెట్టి పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి కేసీఆర్ అని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ అన్నారు. బీసీ యువజన సంఘం కార్యాలయాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షుడు నీలం వెంకటేశ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పనిచేస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నారపు రామాచారి, యామ రవికుమార్, పుల్లయ్య, శ్రీనివాస్, ప్రసాద్, చంద్రశేఖర్, ప్రకాశ్, పాతగాని రమణకుమార్, రమేష్, సరోజ, సుగుణ, రాంబాబు, వెంకటేశ్వర్లు, పాపారావు, వెంకటరామయ్య, పుల్లారావు, నరేష్, మహేష్, అరుణ్, బ్రహ్మం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనకు స్వస్తి పలకడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తెలంగాణాలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడురుపాడులో పలు పార్టీల నుండి బీజేపీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసి దేశంలో ఏదో ఉద్ధరిస్తామని చెబుతున్నారన్నారు. దేశంలో మోదీ పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారని కాబట్టే నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు రాంమోహన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రసాద్, విశ్వనాథం, రామయ్య పాల్గొన్నారు.

డీఐఈఓ కార్యాలయం ముట్టడి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేటు విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జెడ్పీలో జరుగుతున్న ప్రజావాణిలో అదనపు కలెక్టర్ స్నేహల మొగిలి, డీఐఈఓ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడగా దానికి నిరసనగా సోమవారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్‌యూ నాయకులు మస్తాన్, వెంకటేష్, సతీష్, లక్ష్మణ్, కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గీతాముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు, మహిళా ఉద్యమనేత గీతాముఖర్జీ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. గీతాముఖర్జీ శత జయంతోత్సవాల్లో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కొనసాగించాలని తుదిశ్వాస వరకు పోరాడారని, పార్లమెంటులో మహిళా బిల్లును సైతం ప్రవేశపెట్టారన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఎస్‌కె.జానిమియా, మేకల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 63 కిలోల భారీ కేక్‌ను కుటుంబసభ్యులు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కట్ చేశారు. కూసుమంచి శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యేను కోలాటాలు, డప్పుల చప్పుళ్ల నడుమ క్యాంపు కార్యాలయానికి భారీ ర్యాలీగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సతీమణి విజయలక్ష్మీ ప్రారంభించారు.

నేలకొండపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి ప్రసాద్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మయ్య, వెన్నబోయిన శ్రీనివాసరావు, వంగవీటి నాగేశ్వరరావు, గొలుసు రవి, రేణుబాబు, వజ్జా శ్రీనివాసరావు, కవితారాణి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలను సోమవారం నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో నిర్వహించారు. ఖమ్మం అర్బన్ మండల స్థాయిలో ఇంగ్లీష్‌కు సంబంధించిన అంశాలపై పరీక్షను నిర్వహించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు కనపర్తి వెంకటేశ్వర్లు, శంకర్‌రావు, ఉపాధ్యాయులు గురవమ్మ, ఉషాకుమారి, ఆశాకుమారి, ఏ.శ్రీనివాసరావు పారుపల్లి సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్, పడమటితండా, దారేడు గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 25వేలు చొప్పున వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యక్తిగత సహాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌టీపీ మండలాధ్యక్షుడు ఎండపల్లి వెంకయ్య, నాయకులు కాలంగి మోహన్‌రావు, కొనకండ్ల శ్రీనివాసరావు, బి.గాంధీ, వి.రవి, ఎస్‌ఎంసీ చైర్మన్ పల్లె నర్సింహారావు, వార్డు సభ్యులు జంగాలు ఉపేందర్, జి.లక్ష్మి, వై.రాధ, భరత్, నాగేశ్వరరావు, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యానవన శాఖకు సంబంధించి 2023సంవత్సరం క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శిరీష, జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి నిర్మల, జిల్లా ఉద్యానవన అధికారిణి అనసూయ, ఆర్డీఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్: నూతన సంవత్సర పీఆర్‌టీయూ క్యాలెండర్, వాల్ పోస్టర్లను సోమవారం రోటరీనగర్‌లోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు . మండల వనరుల కేంద్రంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ అధ్యక్షుడు స్వామి తిరునగరి మాట్లాడగా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపల్లి వెంకటేశ్వరరావు, గోపాలస్వామి, వెంకటరమణయ్య, వెంకటకుమారి, స్వర్ణకుమారి, సరస్వతి రవికుమార్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు ,రామకృష్ణ, గోపీచంద్, నాగేంద్రబాబు పాల్గొన్నారు

కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న షైన్ ఇండియా సెక్రటరీ, కరస్పాండెంట్ ఉషారాణి

ఖమ్మం సహకారనగర్: దక్షిణ భారతదేశ స్థాయిలో బెంగుళూర్‌లో జరిగిన కరాటే పోటీల్లో తమ విద్యార్థిని కంటమనేని సాయి శ్రీలలిత స్వర్ణపతకం సాధించినట్లు షైన్ ఇండియా స్కూల్ చైర్మన్ తాళ్లూరి సృజన్‌కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తాళ్లూరి ఉషారాణిలు తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని సాయి శ్రీలలితను అభినందించారు.

క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న రాంబాబు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కొత్తగూడెంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బసవయ్య జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న నగర స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. ఆటలను రియల్ వ్యాపారి కుంచపు రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రావుల హనుమంతరావు, నాయకులు పగడాల అనంతరాములు, చాగంటి వెంకట నరసయ్య, చింతకాయ లక్ష్మీనారాయణ, ఎం.భాస్కర్, పగడాల శ్రీనివాసరావు, దుగ్యాల వెంకన్న, బుడిగ ఉపేందర్, గొడుగు రాము పాల్గొన్నారు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువు గ్రామానికి చెందిన గడిపూడి నాగేశ్వరరావుకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సిఫార్సు మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని సోమవారం సీపీఎం నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, నాగటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు రద్దు చేయాలి

తిరుమలాయపాలెం: నకిలీ మిర్చి విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తున్న కంపెనీల లైసెన్స్‌లను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బచ్చోడుతండాలో భూక్యా భీమా, పంతులు, రవీందర్, ధన్‌సింగ్‌ల మిర్చి తోటలను ఆయన పరిశీలించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: దళిత న్యాయవాద దంపతులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టుచేసి, కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం న్యాయవాద దంపతులపై దాడిచేయడంపై జెడ్పీసెంటర్‌లో నిరసన వ్యక్తం చేసి, జేసి, సీపీలకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీరబద్రం, రవికుమార్, భద్రూనాయక్, లిక్కి కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, పద్మాచారి, రెహమాన్, నజీమా, కిషన్‌నాయక్, వెంకటరమణ, సతీష్‌నాయక్, రాము, నాగలక్ష్మి, రమేష్, రాజు, మంగ దాస్ మహరాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు



రిలే దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

ఖమ్మంలీగల్: నగరానికి చెందిన న్యాయవాదులు మోజేష్ క్రిష్టఫర్, ఆవుల అనురాధలపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు సోమవారం రిలే నిరహర దీక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు మాట్లాడుతూ... న్యాయవాదులపైన దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, న్యాయవాద జేఏసీ సభ్యులు బిచ్చాల తిరుమలరావు, కర్లపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. వై.శ్రీనివాసరావు, గద్దల దిలీప్, జాలవతి, పిడితల రాంమూర్తి, సురేష్, తొండపు వెంకటేశ్వరరావు, చిలుకూరి స్వర్ణకుమారి, నేరళ్ల శ్రీనివాసరావు, ధరావత్ వీరన్న, జి.వీరభద్రం, పవన్‌కుమార్, కృష్ణారావు, మర్రి ప్రకాష్, జి.సత్యప్రసాద్, రవి పాల్గొన్నారు.

'పోడు'దారులకు హక్కుపత్రాలు ఇవ్వాలి

రఘునాథపాలెం: పోడు భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గణేశ్వరంలో పోడు భూముల్లో రైతులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి పోడు భూములపై సర్వే నిర్వహించినా హక్కుపత్రాలు జారీలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఇకనైనా సర్వే పూర్తయిన రైతులందరికీ హక్కుపత్రాలు మంజూరు చేయాలని, ఏళ్లుగా పోడు భూమిని నమ్ముకున్న బీసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఇమాం, వెంకటేశ్వర్లు, నరేష్, తిరుపయ్య, శ్రీనివాస్, వెంకన్న, రామకృష్ణ, భద్రు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న ఎస్‌కె.హసీనా ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి సోమవారం అభినందిచారు. ఈ కార్యక్రమంలో హసీనా తండ్రి నాజర్, కోచ్ పి.నాగేష్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 'ఛలో ప్రగతిభవన్' కార్యక్రమానికి బయలుదేరిన ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నాయకులను సోమవారం ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద అడ్డుకొని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేసేవరకు తమ ఉద్యమం ఆగదన్నారు. న్యాయం చేయాలని కోరుతున్న వారిని అరెస్ట్ చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ సమస్య పరిష్కారంలో చూపిస్తే బాగుంటుందని హితవు పలికారు.

అటెన్షన్ ప్లీజ్



ఇలా అయితే ప్రమాదాలు జరగవా ?



మండలంలోని వివిధ గ్రామాల నుంచి గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న వాహనాలతో ప్రమాదం పొంచి ఉంది. గ్రానైట్ రాళ్ల తరలింపు సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవటంతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులపై రాత్రి పగలు తేడా లేకుండా రాళ్ల తరలింపు జరుగుతుండగా.. రాయి కింద పడితే ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇకనైనా రాళ్ల తరలింపు సమయాన భద్రతా చర్యలు పాటించాల్సిన అవసరముంది.

– నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : జి.స్రవంతి, ఎస్సై, నేలకొండపల్లి

సెల్ నంబర్ : 9440904255